# నమస్తే ఉదయం
తెలుగు దినపత్రిక

సంపుటి: 2 | సంచిక: 347 | పేజీలు: 4 | వెల: రూ.4/- | శనివారం 2 ఆగస్టు 2025 | ఎడిటర్: ఎం.వనితా రెడ్డి


## ఎన్నికల అక్రమాలపై అణుబాంబు లాంటి ఆధారాలు

### ఇసిపై విపక్షనేత రాహుల్ గాంధీ విమర్శలు

**న్యూఢిల్లీ, ఆగస్టు 1 (నమస్తే ఉదయం):** ఎన్నికల సంఘంపై లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ తీవ్ర వ్యాఖ్యలు చేశారు. ఎన్నికల సంఘం ఓట్లను చోరీ చేస్తోందని ఆయన ఆరోపించారు. ఆ అక్రమాలకు సంబంధించి పూర్తి ఆధారాలున్నాయని అన్నారు. ఈ ఓట్ల చోరీ అక్రమాలను తీవ్రంగా పరిగణిస్తున్నామని.. బిజెపి కోసం ఇసి ఓట్లను చోరీ చేస్తోందని మండిపడ్డారు. మధ్యప్రదేశ్ అసెంబ్లీ ఎన్నికల్లో, లోక్‌సభ ఎన్నికల్లో, మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల్లో ఓట్ల చోరీ జరిగిందని ధ్వజమెత్తారు. మధ్యప్రదేశ్, మహారాష్ట్రలో కొత్తగా కోటి ఓట్లు- చేర్చారని పేర్కొన్నారు. ఇసి అక్రమాలపై ఆరు నెలలపాటు- దర్యాప్తు చేశామన్నారు. అణుబాంబు లాంటి ఆధారాలు తమ వద్ద ఉన్నాయని.. ఆ అణుబాంబు పేలితే ఎన్నికల సంఘమే ఉండదని హెచ్చరించారు. ఇసిలో అక్రమాలకు పాల్పడిన ఏ స్థాయి అధికారినైనా, ఒకవేళ రిటైరైనా వదిలి పెట్టామని స్పష్టం చేశారు.

## క్షీణిస్తున్న జర్నలిస్టుల
# విశ్వసనీయత

**క్షీణిస్తున్న జర్నలిస్టుల విశ్వసనీయతపై సీఎం రేవంత్ రెడ్డి ఆందోళన**

**నిజమైన జర్నలిస్టులు ఆత్మపరిశీలన చేసుకోవాలని పిలుపు**

**జర్నలిజం ముసుగులో కొందరు దేశద్రోహ కార్యకలాపాలకు పాల్పడుతున్నారని ఆరోపణ**

**ప్రభుత్వ పనితీరుపై విమర్శలను స్వీకరిస్తామని, తప్పులు సరిదిద్దుకుంటాం: సీఎం**



**హైదరాబాద్, ఆగస్టు 1 (నమస్తే ఉదయం)**

ప్రస్తుతం రాజకీయ నాయకుల విశ్వసనీయత ఎంత వేగంగా పడిపోతోందో, జర్నలిస్టుల విశ్వసనీయత కూడా అదే స్థాయిలో పడిపోతోందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సంచలన వ్యాఖ్యలు చేశారు. కొన్ని రాజకీయ పార్టీలు సొంతంగా పత్రికలు, ప్రసార సాధనాలు ఏర్పాటు చేసుకోవడమే ఈ దుస్థితికి కారణమని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. 'నవ తెలంగాణ' దినపత్రిక ప్రారంభోత్సవ కార్యక్రమంలో పాల్గొన్న ఆయన, నిజమైన జర్నలిస్టులు ఇకనైనా ఒక లక్ష్మణరేఖ గీసుకోవాలని, జర్నలిజం ముసుగులో అరాచకం సృష్టిస్తున్న వారిని వేరుచేయాల్సిన సమయం ఆసన్నమైందని స్పష్టం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, "గతంలో జర్నలిస్టులను ఎంతో గౌరవించేవాళ్లం. వారి నుంచి సలహాలు, సూచనలు తీసుకుని ఎంతో హోంవర్క్ చేసి మాట్లాడేవాళ్లం. కానీ నేటి వింత పోకడల వల్ల ఆ పరిస్థితి మారింది. కొందరు సోషల్ మీడియా ముసుగులో పాకిస్థాన్ ఏజెంట్లుగా పనిచేస్తూ దేశ భద్రతకే ప్రమాదకరంగా మారుతున్నారు" అని హెచ్చరించారు. ఇలాంటి చర్యలను అరికట్టకపోతే సమాజానికి తీవ్ర నష్టం ..మిగతా 2లో

## సీఎం రేవంత్‌కు కాళేశ్వరం కమిషన్ నివేదిక



### అందచేసిన మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి

**హైదరాబాద్, ఆగస్టు 1 (నమస్తే ఉదయం)**

తెలంగాణలోని కాళేశ్వరం లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టు నిర్మాణంలో అవకతవకలు జరిగాయన్న ఆరోపణలపై సుప్రీంకోర్టు రిటైర్డ్ న్యాయమూర్తి పీసీ ఘోష్ కమిషన్ సమర్పించిన నివేదికపై తదుపరి చర్యలు తీసుకోవడానికి ప్రభుత్వం సిద్ధమవుతోంది. ఈ నివేదికను సమగ్రంగా అధ్యయనం చేసి, సారాంశాన్ని సిద్ధం చేయడానికి ప్రభుత్వం శుక్రవారం ఒక కమిటీని ఏర్పాటు చేసింది. ఈ కమిటీలో నీటిపారుదల శాఖ, న్యాయ శాఖ, సాధారణ పరిపాలన శాఖ కార్యదర్శులు సభ్యులుగా ఉన్నారు. ఈ కమిటీ ఆగస్టు 4న రాష్ట్ర మంత్రిమండలికి తన నివేదికను సమర్పించనుంది. ఆ తర్వాత క్యాబినెట్ సమావేశంలో ఈ నివేదికలోని ..మిగతా 2లో



## 71వ జాతీయ చలన చిత్ర అవార్డులు

**తెలుగులో ఉత్తమ చిత్రంగా 'భగవంత్ కేసరి'**

**జాతీయ అవార్డులు ప్రకటించిన కేంద్రం**

**జాతీయ ఉత్తమ చిత్రంగా '12 ఫెయిల్'**

**ఉత్తమ నటుడిగా షారుఖ్ ఖాన్, విక్రాంత్ మాసే**

**ఉత్తమ నటిగా రాణి ముఖర్జీ**

**న్యూఢిల్లీ, ఆగస్టు 1 (నమస్తే ఉదయం)**

కేంద్ర ప్రభుత్వం 71వ జాతీయ చలనచిత్ర అవార్డులను ప్రకటించింది. '12 ఫెయిల్' సినిమా జాతీయ ఉత్తమ చిత్రంగా ఎంపికైంది. జాతీయ ఉత్తమనటుడు అవార్డును షారుఖ్ ఖాన్ (జవాన్), విక్రాంత్ మాసే (12 ఫెయిల్) పంచుకున్నారు. ఉత్తమ నటిగా రాణి ముఖర్జీ (మిసెస్ ఛటర్జీ వర్సెస్ నార్వే) పురస్కారానికి ఎంపికయ్యారు.

ఇక, నందమూరి బాలకృష్ణ-అనిల్ రావిపూడి కాంబోలో వచ్చిన 'భగవంత్ కేసరి' చిత్రం తెలుగులో ఉత్తమ చిత్రంగా నిలిచింది. జాతీయ ఉత్తమ కన్నడ చిత్రంగా 'కందీలు', జాతీయ ఉత్తమ తమిళ చిత్రంగా 'పార్కింగ్' ఎంపికయ్యాయి. జాతీయ ఉత్తమ హిందీ చిత్రం 'కథల్' ఎంపికైంది. ఇక, జాతీయ ఉత్తమ యాక్షన్ డైరెక్షన్ సినిమా కేటగిరీలో 'హనుమాన్' అవార్డుకు ఎంపికైంది.

జాతీయ ఉత్తమ సినీ గీతంగా తెలుగు పాట ఎంపికవడం విశేషం. బలగం సినిమాలోని 'ఉరు-పల్లెటూరు' అంటూ సాగే పాటకు జాతీయ పురస్కారం దక్కింది. ఈ పాటకు కాసర్ల శ్యామ్ సాహిత్యం అందించారు. జాతీయ ఉత్తమ సంగీత దర్శకుడిగా ఏఆర్ రెహమాన్ మేనల్లుడు జీవీ ప్రకాశ్ కుమార్ (వాత్తి) అవార్డుకు ఎంపికయ్యారు.

జాతీయ ఉత్తమ స్క్రీన్ ప్లే రైటర్ గా సాయి రాజేశ్ ఎంపికయ్యారు. సూపర్ హిట్టయిన 'బేబీ' చిత్రానికి గాను ఆయన ఈ పురస్కారం అందుకోనున్నారు. అంతేకాదు, 'బేబీ' చిత్రానికి గాను పీవీఎన్ఎస్ రోహిత్ జాతీయ ఉత్తమ నేపథ్య గాయకుడిగా అవార్డుకు ఎంపికయ్యారు.

### జాతీయ అవార్డుల జాబితా

ఫీచర్ ఫిల్మ్ కేటగిరీ
ఉత్తమ జాతీయ చిత్రం: 12త్ ఫెయిల్ (హిందీ)
ఉత్తమ నటుడు: షారుక్ ఖాన్ (జవాన్, హిందీ)
విక్రాంత్ మస్సే (12త్ ఫెయిల్, హిందీ)
ఉత్తమ నటి: రాణీ ముఖర్జీ (మిస్సెస్ ఛటర్జీ వర్సెస్ నార్వే, హిందీ)
ఉత్తమ సహాయ నటుడు: విజయ రాఘవన్ (పూక్కాలం, మలయాళం), ముత్తుపెట్టాయ్ సోము భాస్కర్ (పార్కింగ్, తమిళం)
ఉత్తమ సహాయ నటి: ఊర్వశి (ఉల్లుకు, మలయాళం), జానకీ బోడివాలా (వష్, గుజరాతీ)
ఉత్తమ దర్శకత్వం: సుదీప్తో సేన్ (ది కేరళ స్టోరీ, హిందీ)
ఉత్తమ తెలుగు చిత్రం: భగవంత్ కేసరి
ఉత్తమ తమిళ చిత్రం: పార్కింగ్
ఉత్తమ ఫిల్మ్ క్రిటిక్ అవార్డు: ఉత్పల్ దత్త (అస్సామీ)
ఉత్తమ సంగీత దర్శకత్వం: జీవీ ప్రకాశ్ కుమార్ (వాతి, తమిళం)
ఉత్తమ నేపథ్య సంగీతం: హర్షవర్ధన్ రామేశ్వర్ (యానిమల్, హిందీ)
ఉత్తమ మేకప్: శ్రీకాంత్ దేశాయ్ (సామ్ బహదూర్, హిందీ)
ఉత్తమ కాస్ట్యూమ్ డిజైన్: సామ్ బహదూర్ (హిందీ)
ఉత్తమ ప్రొడక్షన్ డిజైన్: మోహన్‌దాస్ (2018 – ఎవ్రీ వన్ ఈజ్ ఏ హీరో, మలయాళం)
ఉత్తమ ఎడిటింగ్: మిథున్ మురళి (పూక్కాలం, మలయాళం)
ఉత్తమ సౌండ్ డిజైన్: సచిన్ సుధాకరన్, హరి హరన్ మురళీ ధరన్ (యానిమల్, హిందీ)
ఉత్తమ స్క్రీన్‌ప్లే (ఒరిజినల్): సాయి రాజేశ్ నీలం (బేబీ, తెలుగు), రామ్‌కుమార్ బాలకృష్ణన్ (పార్కింగ్, తమిళం)
ఉత్తమ సంభాషణలు: దీపక్ కింగ్రానీ (సిర్ఫ్ ఏక్ బందా కాఫీ హై, హిందీ)
ఉత్తమ సినిమాటోగ్రఫీ: పసంతను మొహపాత్రో (ది కేరళ స్టోరీ, హిందీ)
ఉత్తమ నేపథ్య గాయని: శిల్పారావు (జవాన్ – చెలియా, హిందీ)

## రాష్ట్రానికి మరో మణిహారం..
# యాదాద్రి పవర్ ప్లాంట్
### మొదటి యూనిట్ జాతికి అంకితం!



**యాదాద్రి, ఆగస్టు 1 (నమస్తే ఉదయం)**

యాదాద్రి థర్మల్ పవర్ ప్లాంట్ రాష్ట్రానికి ఆశాదీపమైంది. దీంతో విద్యుత్తు సరఫరాలో దేశంలోనే తెలంగాణ రాష్ట్రం నంబర్‌వన్ స్థానంలో నిలువనుంది. సూపర్ క్రిటికల్ టెక్నాలజీతో దేశంలో ప్రభుత్వ రంగంలో అతిపెద్ద థర్మల్ విద్యుత్ కేంద్రంగా యాదాద్రి థర్మల్ పవర్ ప్లాంట్ అవతరించింది. దేశ విద్యుత్ రంగానికి దేశానికి కలికితురాయిగా నిలిచిన యాదాద్రి థర్మల్ పవర్ ప్లాంట్ మొదటి యూనిట్ ను ప్రభుత్వం జాతికి అంకితం చేసింది. గత ఏడాది డిసెంబర్ లో సీఎం రేవంత్ రెడ్డి రెండవ యూనిట్‌ను జాతికి అంకితం చేశారు. మొదటి, రెండో యూనిట్ల నుంచి పూర్తి స్థాయిలో విద్యుత్ ఉత్పత్తితో కాంతులు విరజిమ్ముతున్నాయి. రాష్ట్రంలో విద్యుత్ కోతలు లేకుండా నిరంతరాయంగా వ్యవసాయానికి నాణ్యమైన ..మిగతా 2లో

## ఉపరాష్ట్రపతి ఎన్నికకు
# షెడ్యూల్ విడుదల

**7న ఎన్నికల సంఘం నోటిఫికేషన్ జారీ**

**నామినేషన్లు దాఖలుకు ఆగస్టు 21 చివరితేదీ**

**సెప్టెంబర్ 9న ఎన్నిక... అదే రోజు ఫలితం ప్రకటన**



**హైదరాబాద్, ఆగస్టు 1 (నమస్తే ఉదయం)**

జగదీప్ ధన్‌ఖడ్ రాజీనామాతో ఖాళీగా ఉన్న ఉపరాష్ట్రపతి పదవికి ఎన్నికల సంఘం కసరత్తు మొదలు పెట్టింది. ఈ క్రమంలో నూతన ఉప రాష్ట్రపతి ఎన్నిక కోసం శుక్రవారం షెడ్యూల్ విడుదలైంది. సెప్టెంబర్ 9న ఆ ఎన్నిక జరగనుందని కేంద్ర ఎన్నికల సంఘం వెల్లడించింది. జగదీప్ ధన్‌ఖడ్ తన పదవికి అనూహ్యంగా రాజీనామా చేయడంతో ఈ ప్రక్రియ అనివార్యమైంది. పార్లమెంటు-వర్షాకాల సమావేశాలు ప్రారంభమైన తొలిరోజే ధన్‌ఖడ్ తన పదవిని వీడారు. ఈ నేపథ్యంలో ఎన్నిక షెడ్యూల్ విడుదలైంది. దీనిపై ఆగస్టు 7న ఎన్నికల సంఘం నోటిఫికేషన్ జారీ చేయనుంది. నామినేషన్లు ..మిగతా 2లో



2

## 70 దేశాలకు అధిక టారిఫ్‌తో షాకిచ్చిన ట్రంప్

**పరస్పర సుంకాలను విధించే కార్యనిర్వాహక ఉత్తర్వులపై సంతకం**

**10 శాతం నుంచి 41 శాతం వరకు సుంకాలను పెంచిన ట్రంప్**

**భారత్‌పై 25 శాతం టారిఫ్**

**పాకిస్థాన్‌కు 29 శాతం నుంచి 19 శాతానికి తగ్గింపు**

## పబ్లిక్ స్కూల్‌లో ప్రవేశానికి ఎస్సీ విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలి

**డాక్టర్ బి. విక్రమ్ కుమార్**

జనగామ, ఆగస్టు 01(నమస్తే ఉదయం): 2025-26 సంవత్సరానికి గాను జనగామ జిల్లాకు చెందిన షెడ్యూల్ కులాల బాలబాలికల నుండి హైదరాబాదులోని రామంతపూర్ లో ఉన్న పబ్లిక్ స్కూల్ లో ఒకటో తరగతిలో (01) ప్రవేశం కొరకు అర్హులైన వారు దరఖాస్తు చేసుకోవాలని జిల్లా షెడ్యూల్ కులాల అభివృద్ధి అధికారి డాక్టర్ బి. విక్రమ్ కుమార్ శుక్రవారం ఒక ప్రకటన లో తెలిపారు.దరఖాస్తులు పొందుటకు కలెక్టర్ కార్యాలయంలోని ఎఫ్-25 లో గల షెడ్యూల్ కులాల అభివృద్ధి అధికారి కార్యాలయంలో ఆగస్టు 1వ తారీకు నుండి పొందవచ్చు నని, పూర్తిచేసిన దరఖాస్తులను ఆగస్టు 8వ తారీకు సాయంత్రం నాలుగున్నర గంటల వరకు కార్యాలయంలో సమర్పించాలన్నారు. దరఖాస్తు చేసుకునే బాల బాలికలు 01.06.2018 నుండి 31- 05- 2019 సంవత్సరంల మధ్య జన్మించి ఉండాలన్నారు. పుట్టిన తేదీ ధ్రువీకరణ పత్రము మున్సిపల్ కార్పొరేషన్ నుండి కానీ తాసిల్దార్ కార్యాలయం నుండి కానీ మీ.సేవ నుండి పొందినవి జతపరచాలన్నారు.అదేవిధంగా కుల దృవీకరణ పత్రము, ఆదాయ ధ్రువీకరణ పత్రం, నివాస ధ్రువీకరణ పత్రం లు మీసేవ నుండి పొందినవి మాత్రమే జతపరచాలన్నారు. గ్రామీణ ప్రాంతం వారు ఒక లక్ష యాభై వేలు ఆదాయం కలిగి ఉండాలని అలాగే పట్టణ ప్రాంతం వారు రెండు లక్షలు మించకుండా ఆదాయం కలిగి ఉన్నవారు మాత్రమే అర్హులుగా పేర్కొన్నారు.రేషన్ కార్డు, ఆధార్ కార్డు, జతపరుస్తూ ప్రస్తుత పాస్ ఫోటో దరఖాస్తు పై అంటించాలన్నారు. తల్లిదండ్రుల మొబైల్ నెంబర్లు కూడా దరఖాస్తుపై వ్రాయాలని షెడ్యూల్ కులాల అభివృద్ధి అధికారి తెలియజేశారు.

## క్షీణిస్తున్న జర్నలిస్టుల విశ్వసనీయత

మొదటి పేజీ తరువాయి...

వాటిల్లుతుందని అన్నారు. ప్రజా సమస్యల పట్ల నిబద్ధతతో పనిచేసే పత్రికలకు తమ ప్రభుత్వం అండగా ఉంటుందని రేవంత్ రెడ్డి హామీ ఇచ్చారు. “మసాలా వార్తలు, గాసిప్‌లు రాసే వాణిజ్య పత్రికలకు దీటుగా ‘నవ తెలంగాణ’ పత్రికకు కూడా ప్రభుత్వ ప్రకటనలు సమానంగా ఇవ్వాలి” అని అక్కడే ఉన్న మంత్రికి ఆయన సూచించారు. ప్రజాపక్షం వహించే మీడియా సంస్థలను బ్యాలెన్స్ చేయాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని తెలిపారు. ప్రజా సమస్యల పరిష్కారంలో కమ్యూనిస్టుల పాత్రను ఆయన ఉప్పుతో పోల్చారు. “ఏ వంటకంలో ఎన్ని మసాలాలు వేసినా ఉప్పు లేకపోతే రుచి రాదు. అలాగే ప్రజా సమస్యలపై ఎర్రజెండా గొంతు వినిపించినప్పుడే ప్రజలకు నమ్మకం కలుగుతుంది” అని రేవంత్ రెడ్డి అభిప్రాయపడ్డారు. ప్రభుత్వం మంచి పనులు చేస్తే మైకులో చెప్పాలని, తప్పులు చేస్తే చెవిలో చెప్పకపోయినా పర్వాలేదని, పత్రికల్లో రాస్తే వాటిని స్వీకరించి సరిదిద్దుకుంటామని ఆయన భరోసా ఇచ్చారు. భవిష్యత్తులో కాంగ్రెస్, కమ్యూనిస్టులు కలిసి పనిచేస్తే ప్రజలకు మేలు జరుగుతుందని ఆయన ఆకాంక్షించారు.

## సీఎం రేవంత్‌కు కాళేశ్వరం కమిషన్ నివేదిక

మొదటి పేజీ తరువాయి...

సిఫార్సులు, అంశాలపై చర్చించి, తదుపరి చర్యలపై నిర్ణయం తీసుకోనున్నారు. సుమారు 700 పేజీల నివేదికను పీసీ ఘోష్ కమిషన్ గురువారం నీటిపారుదల శాఖ కార్యదర్శి రాహుల్ బొజ్జాకు అందజేసింది. అనంతరం శుక్రవారం ఈ నివేదికను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి అందజేశారు. ఈ సందర్భంగా ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, నీటిపారుదల శాఖ మంత్రి ఎన్. ఉత్తమ్ కుమార్ రెడ్డి, రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డితో ముఖ్యమంత్రి చర్చించారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణంలో జరిగిన అవకతవకలను ఈ నివేదిక ప్రస్తావించినట్లు సమాచారం. ఈ నివేదిక ఆధారంగా దోషులుగా తేలిన వారిపై క్రిమినల్ చర్యలు తీసుకోవాలా లేదా అనే దానిపై మంత్రివర్గ సమావేశంలో చర్చ జరగనుంది. అలాగే, తప్పు చేసిన అధికారులపై శాఖాపరమైన చర్యలు తీసుకోవాలని కూడా ప్రభుత్వం యోచిస్తున్నట్లు తెలుస్తోంది.

## ఉపరాష్ట్రపతి ఎన్నికకు షెడ్యూల్ విడుదల

మొదటి పేజీ తరువాయి...

దాఖలుకు చివరితేదీ ఆగస్టు 21గా ప్రకటించింది. పోలింగ్ తేదీ నాడే అంటే సెప్టెంబర్ 9నే ఫలితాలు వెల్లడి కానున్నాయి. ఉప రాష్ట్రపతి పదవికి ఎన్డీయే కూటమి.. ఎవరిని ఎంపిక చేస్తుందన్న దానిపై ఆసక్తి నెలకొంది. ఇప్పటికే రేసులో పలువురి పేర్లు తెర పైకి వచ్చాయి. బిహార్ ముఖ్యమంత్రి నీతీశ్‌కుమార్, జేడీయూ నేత హరివంశ్ నారాయణ్ సింగ్, కాంగ్రెస్ ఎంపీ శశిథరూర్ సహా పలువురు నేతల పేర్లు ఉప రాష్ట్రపతి రేసులో ఉన్న సంగతి తెలిసిందే. పార్టీ సిద్ధాంతాలు, భావజాలానికి అనుగుణంగా వ్యవహరించే నేతకు భాజపా ఆ పదవిని అప్పగిస్తుందని సమాచారం. ఇదిలావుంటే ఆరోగ్యపరమైన కారణాలతో రాజీనామా చేస్తున్నట్లు- రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ముకు లేఖ పంపారు. 2022 ఆగస్టు 11న ఉప రాష్ట్రపతిగా బాధ్యతలు చేపట్టిన ధన్‌ఖడ్‌కు 2027 ఆగస్టు వరకూ పదవీకాలం ఉంది. అయితే రెండేళ్ల 344 రోజులకే వైదొలిగారు. 74 ఏళ్ల ధన్‌ఖడ్ తర్వాత ఉప రాష్ట్రపతిగా ఎవరిని ఎన్నుకుంటారనే అంశంపై ఆసక్తి నెలకొంది. ఉభయ సభల్లో వివిధ ఖాళీలతో కలిపి సభ్యుల సంఖ్య ప్రస్తుతం 786గా ఉంది. ఇందులో మెజారిటీకి 394 మంది మద్దతు అవసరం. లోక్‌సభలో ఎన్డీయేకు 293 మంది సభ్యుల బలముంది. రాజ్యసభలో 129 మంది మద్దతుంది. మరోవైపు విపక్ష కూటమికి లోక్‌సభలో 234 మంది సభ్యులు, రాజ్యసభలో 79 మంది సభ్యుల బలముంది. మొత్తంగా ఎన్డీయేకు 422 మంది, విపక్ష కూటమికి 313 మంది అనుకూలంగా ఉన్నారు. ఇలా ఉభయ సభల్లో మెజారిటీ లేనప్పటికీ ఉప రాష్ట్రపతి ఎన్నికలో పోటీ చేసేందుకు విపక్షాలు సిద్ధమవుతున్నట్లు తెలుస్తోంది.

## 70 దేశాలకు అధిక టారిఫ్‌తో షాకిచ్చిన ట్రంప్

**న్యూఢిల్లీ, ఆగస్టు 1 (నమస్తే ఉదయం)**

అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మరోసారి అధిక సుంకాలను విధిస్తూ దాదాపు 70 దేశాలకు షాక్ ఇచ్చారు. అదే సమయంలో పాకిస్థాన్‌కు టారిఫ్‌ను తగ్గిస్తూ ఆశ్చర్యకర నిర్ణయం తీసుకున్నారు. 10 శాతం నుంచి 41 శాతం వరకు పరస్పర సుంకాలను విధించే కార్యనిర్వాహక ఉత్తర్వులపై ఆయన సంతకాలు చేశారు. సిరియాపై అత్యధికంగా 41 శాతం టారిఫ్ విధించారు.వివిధ దేశాలపై టారిఫ్‌ను భారీగా పెంచారు. కెనడా నుంచి వచ్చే దిగుమతులపై సుంకాన్ని 25 శాతం నుంచి 35 శాతానికి పెంచారు. బ్రెజిల్‌పై ప్రస్తుతం ఉన్న పది శాతానికి 40 శాతాన్ని జత చేశారు. భారత్‌పై 25 శాతం టారిఫ్ విధించిన ట్రంప్, పాకిస్థాన్‌పై పది శాతం తగ్గించారు. ఆ దేశంపై 29 శాతంగా ఉన్న పన్నును 19 శాతానికి తగ్గించారు. జాబితాలో లేని దేశాల నుంచి దిగుమతి అయ్యే ఉత్పత్తులపై 10 శాతం సుంకం ఉంటుందని ట్రంప్ ఉత్తర్వుల్లో వెల్లడించారు.పరస్పర సుంకాలను సవరించడానికి, వాణిజ్య ఒప్పందం చేసుకోవడానికి ఆగస్టు 1 వరకు ట్రంప్ గడువు ప్రకటించారు. ఈ సవరించిన టారిఫ్‌లు ఏడు రోజుల్లో అమల్లోకి రానున్నాయి. భారత్, కెనడా దేశాలకు చెందిన దిగుమతులపై విధించిన టారిఫ్ మాత్రం నేటి నుంచి అమల్లోకి వస్తుందని డొనాల్డ్ ట్రంప్ ప్రకటించారు.

# ఆరోపణలు ఉన్న వ్యక్తే అధ్యక్షులా?

### నాడు టి ఎన్ జి ఓ ఎస్ సొసైటీలో ఉద్యోగుల ప్లాట్లు కొల్లగొట్టిన ఆరోపణలు

### నేడు ఇందిరాగాంధీ హౌసింగ్ సొసైటీకి అధ్యక్షులు

### మరి సొసైటీ సభ్యుల ప్లాట్లు పదిలమేనా.?

**తెలంగాణ బ్యూరో, ఆగస్టు 1 ( నమస్తే ఉదయం )**

సొసైటీ (సమాజం) ఒక నిర్దిష్ట ప్రదేశంలో నివసించేందుకు అందరూ కలిసి ఓ సంఘంగా ఏర్పడి తమ నివాస అవసరాల కోసం ఏర్పరచుకున్న సమూహంమే సొసైటీ. అయితే సొసైటీ, ఓ సంఘము , నివాసాల సముదాయము, సంక్షేమ సంస్థలను బాధ్యతయుతంగా నిర్వహించాలంటే అందుకు తగ్గట్లుగా ఆ సంఘము, సంస్థలను సమర్థవంతంగా నిర్వహించే వ్యక్తులను, అధ్యక్షులుగా ఇతర పాలక మండలిని ఎన్నుకుంటారు. నీతి నిజాయితీతో, స్వార్థ ప్రయోజనాలకు పోకుండా సమాజ సంక్షేమం కోసం పాటుపడే వ్యక్తిని అధ్యక్షునితోపాటు అదే స్థాయిలో పాలకమండలిని ఎన్నుకున్నప్పుడే ఆ సమాజము, ఆ సముదాయము అభివృద్ధిలో దూసుకుపోతుంది. సమాజంలో ఉన్న సభ్యులందరికీ లాభదాయకం అవుతుంది కూడా. అయితే అదే సమాజం, సంఘము అధ్యక్షులు అవినీతిపరుడో...? అక్రమార్కుడో....?, అసమర్థ నాయకుడు అయితే ఆ సంఘము సమాజము కుప్ప కూలిపోతుంది. ఫలితంగా సమాజంలో ఉన్న సభ్యులందరూ నిట్ట నిలువన మునగాల్సిన పరిస్థితి దాపురిస్తుంది. ఇలాంటి ఘటనలు నగరంతో పాటు నగర శివారులో కోకోల్లాలుగా జరిగాయి. అయితే ఇప్పుడిప్పుడే అభివృద్ధి చెందుతున్న రాజేంద్రనగర్ శివారులో ఉన్న ఇందిరా గాంధీ హౌసింగ్ సొసైటీ పరిస్థితి అగమ్య గోచరంగా తయారైంది. ఈ మధ్య నే నూతనంగా ఎన్నికైన అధ్యక్షులపై గతంలో పలు ఆరోపణలు ఉన్నాయి. ఆరోపణలు ఉన్న అధ్యక్షుల చేత ఇందిరాగాంధీ హౌసింగ్ సొసైటీ లాభదాయకంగా ముందుకు సాగేనా.... లేక అన్ని సొసైటీల లాగా అక్రమాలచోటు చేసుకుని కుప్పకూలేనా..? మునుముందు వేచి చూడాలి మరి.



ఇందిరాగాంధీ హౌసింగ్ సొసైటీ ఆఫీస్ కార్యాలయం

**ఇందిరాగాంధీ హౌసింగ్ సొసైటీ.**

ఇందిరాగాంధీ హౌసింగ్ సొసైటీ గత ఐదు దశాబ్దాల క్రితం ఏర్పడింది. రంగారెడ్డి జిల్లాలోని రాజేంద్రనగర్ మండలం, బాలాపూర్ మండల పరిధిలో 190 ఎకరాల విస్తీర్ణంలో ఇందిరాగాంధీ హౌసింగ్ సొసైటీ అవతరించింది. 190 ఎకరాల విస్తీర్ణంలో వున్నా ఈ సొసైటీలో 803 ప్లాట్లను ఏర్పాటు చేశారు. అయితే రాజేంద్రనగర్ మండలం ప్రస్తుతం గ్రేటర్ హైదరాబాద్ రాజేంద్రనగర్ సర్కిల్ పరిధి లోని గగన్ పహాడ్ ప్రాంతంలో మెజార్టీ ప్లాట్లు ఉండగా, బాలాపూర్ మండలంలోని జలపల్లి మున్సిపాలిటీ పరిధిలో ఉన్న శ్రీరామ్ నగర్ కాలనీలో మిగతా ప్లాట్లు ఏర్పడ్డాయి.


రాష్ట్ర మాజీ మంత్రివర్యులు సబితా ఇంద్రారెడ్డిని మర్యాదపూర్వకం కలిసిన జయప్రకాష్, ఇతర కమిటీ సభ్యులు.

సొసైటీలో భవిష్యత్ తరాల సంక్షేమం కోసం ఓపెన్ ప్లాట్స్ ఎన్నో వదిలారు. అదేవిధంగా ఎత్తైన ప్రాంతంలో ఉండే ఈ ప్రదేశంలో ఉన్న గుట్టలను హిల్స్ ప్లేస్ పేరుతో ఎకరాల కొద్దీ స్థలాలను అదనంగా వదిలిపెట్టారు. అయితే సొసైటీ ఏర్పడిన గత నాలుగు దశాబ్దాలుగా అంతా సవ్యంగా సాగిన.... దినదిన అభివృద్ధి చెందుతున్న ప్రస్తుత తరుణంలో ఈ సొసైటీ చుట్టుపక్కల ప్రాంతాలు ఎంతో అభివృద్ధి చెందాయి. ఓవైపు ఔటర్ రింగ్ రోడ్డు మరోవైపు శంషాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయం, ఇంకోవైపు శ్రీశైలం హైవే, జలపల్లి మున్సిపాలిటీ సమీపంలో అనేక ఐటి కంపెనీలు రావడంతో ఇందిరాగాంధీ సొసైటీ చుట్టుపక్కల ప్లాట్ల ధరలు ఆకాశాన్ని అంటాయి. ఈ సొసైటీ లోని ప్లాట్ల ధరలు సైతం భారీగా పెరిగాయి. ఇదే అదను గా చేసుకున్న సొసైటీ చుట్టుపక్కల ప్రాంతాలకు చెందిన కొందరు రాజకీయ పలుకబడి ఉన్న నాయకులు ఇందిరాగాంధీ సొసైటీ పై కన్ను వేశారు. అప్పటివరకు ఇందిరాగాంధీ సొసైటీలో కనీసం అర గజం కూడా లేని నాయకులు ( సిండికేట్ గా) కుమ్మక్కై ఇందిరాగాంధీ సొసైటీలో అక్కడక్కడ కొన్ని ప్లాట్లు కొని సొసైటీలో పాగా వేశారు. ఈ సొసైటీని ఎలాగైనా తమ ఆధీనంలోకి తీసుకోవాలని పక్కా ప్రణాళికతో ఉన్న సదరు వ్యక్తులు నేడు అధ్యక్షులు ఇతర పాలకమండలి చోటు సంపాదించుకున్నారని చుట్టుపక్కల కాలనీవాసులు తెలుపుతున్నారు.

**ఆ సొసైటీలో ఆరోపణలు,. ఈ సొసైటీకి అధ్యక్షులు.**

ఇందిరాగాంధీ హౌసింగ్ సొసైటీ నూతన అధ్యక్షులుగా ఎన్నికైన సదరు వ్యక్తిపై పలు ఆరోపణలు ఉన్నట్లు స్థానికులు తెలుపుతున్నారు. ఇందిరాగాంధీ హౌసింగ్ సొసైటీకి సమీపంలో ఉన్న కాటేదాన్ ప్రాంతంలో గల టీఎన్జీవోఎస్ సొసైటీలో సదర అధ్యక్షుడు పలు అక్రమాలకు పాల్పడినట్లు బహిరంగంగానే ఇక్కడి సొసైటీ సభ్యులు వాపోతున్నారు. ఉద్యోగులకు సంబంధించిన పదుల కొద్ది ప్లాట్లను నిబంధనలకు విరుద్ధంగా అక్రమంగా తనపై తన బినామీ అనుచరులపై చట్ట విరుద్ధంగా రిజిస్ట్రేషన్ చేయించుకున్నారని నేటికీ ప్రధాన ఆరోపణలు ఉన్నాయి. దశాబ్ద కాలం క్రితం అప్పటి టీఎన్జీవో ఎస్ సొసైటీ ప్రధాన కార్యదర్శి అయిన పెంటయ్య అనే మాజీ ఉద్యోగి సహకారంతో ఎన్జీవో సొసైటీలో ఉద్యోగులకు సంబంధించిన ఎన్నో ఓపెన్ ప్లాట్లను ఉద్యోగులు కాని వ్యక్తులపైన రిజిస్ట్రేషన్ చేయించి భారీ ఎత్తున లబ్ధి పొందారని సొసైటీ సభ్యులతో పాటు కాటేదాన్ పరిసర ప్రాంతాల ప్రజలు బహిరంగంగానే ఆరోపిస్తున్నారు. టీఎన్జీవోఎస్ సొసైటీలో అక్రమాలకు పాల్పడిన సదర వ్యక్తి ఇందిరాగాంధీ సొసైటీకి అధ్యక్షులై ప్రమాణ స్వీకారం కూడా చేయడంతో సొసైటీ లో ఉన్న తమ ప్లాట్ల, సంక్షేమం కోసం కోసం కేటాయించిన స్థలాల పరిస్థితి ఏమిటని సొసైటీలోని ప్లాట్ ల ఓనర్లు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.


ఇందిరాగాంధీ సొసైటీ అధ్యక్షులు జయప్రకాష్ ని సన్మానిస్తున్న టి ఎన్ జి ఓ ఎస్ కాలనీ రియాల్టర్ రామలింగయ్య గుప్తా


ఇందిరాగాంధీ సొసైటీ అధ్యక్షులు శాలువాతో సత్కరిస్తున్న కాంగ్రెస్ నాయకులు రవి ముదిరాజ్ తదితరులు

**సొసైటీ సభ్యుల ప్లాట్లు పదిలమేనా....?**

ఇందిరాగాంధీ హౌసింగ్ సొసైటీలో దాదాపు 803 ప్లాట్లతో లేఔట్ ఏర్పడింది. ఈ సొసైటీలో ఎక్కువ మొత్తంలో ఉద్యోగులు, పదవి విరమణ చేసిన వాళ్ళు, పింఛన్దారులతోపాటు సీనియర్ సిటిజెన్లు నెల నెల కొద్దిగా పోగుచేసి వాయిదాల పద్ధతిలో పాట్లను కొనుగోలు చేశారు. సొసైటీలో రోజురోజుకు అక్రమాలు చోటు చేసుకోవడం, నిత్యం డబుల్ రిజిస్ట్రేషన్లు జరగడం శర మామూలుగా మారింది. అయితే సొసైటీ అభివృద్ధి కోసం ఎవరో ఒకరు ఓ మంచి నాయకుడు వస్తాడు అనుకున్నా తరుణంలో ఆరోపణలు ఉన్న వ్యక్తే అధ్యక్షులుగా రావడంతో ప్లాట్ల ఓనర్లు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మా ప్లాట్లు పదిలంగా ఉంటాయా అన్యాక్రాంతమవుతాయని భయాందోళనలకు గురవుతున్నారు. ఇప్పటికే సొసైటీలో పదులకొద్దు ప్లాట్లు డబుల్ రిజిస్ట్రేషన్ అయ్యాయని, ఇంద్ర గాంధీ హౌసింగ్ సొసైటీ ఆఫీస్ చుట్టు కాల్ అరిగేలా తిరుగుతున్న సమస్యలు పరిష్కారం కావడం లేదని పలువురు ఆపోతున్నారు. ఇందిరాగాంధీ హౌసింగ్ సొసైటీలో అక్రమాలకు పాల్పడిన కబ్జారాయుళ్లపై స్థానిక పోలీస్ స్టేషన్లో పలు కేసులు నమోదు అయిన విషయం విధితమే. మరి నూతనంగా ఎన్నికైన అధ్యక్షుడు పాలకమండలి ఇందిరాగాంధీ సొసైటీని ఏ విధంగా అభివృద్ధి చేస్తారో వేచి చూడాలి.


జయప్రకాష్ ను సన్మానిస్తున్న స్థానికులు

# పచ్చదనం పెంపొందించాలి పర్యావరణాన్ని కాపాడాలి: మంత్రి శ్రీహరి

### తల్లి రాములమ్మ పేరుతో మొక్క నాటిన మంత్రి వాకిటి


సంగం బండ రెసిడెన్షియల్ పాఠశాలలో మొక్క నాటుతున్న మంత్రి శ్రీహరి


వన మహోత్సవం కార్యక్రమంలో పాల్గొన్న అధికారులు ,ప్రజాప్రతినిధులు

మక్తల్,01,ఆగస్టు, (నమస్తే ఉదయం): రోజురోజుకు పెరుగుతున్న కాలుష్యాన్ని నివారించడానికి పచ్చదనాన్ని పెంపొందించడానికి సమాజంలోని ప్రతి ఒక్కరు భాగస్వాములు కావాలని తెలంగాణ రాష్ట్ర పశుసంవర్ధక శాఖ మంత్రి వాకిటి శ్రీహరి అన్నారు. మక్తల్ మండలంలోని సంగంబండ రెసిడెన్షియల్ పాఠశాల ప్రాంగణంలో ఘనంగా నిర్వహించిన వనమహోత్సవ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర మంత్రి డా. వాకిటి శ్రీహరి ముఖ్య అతిథిగా పాల్గొని,ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ... పర్యావరణ పరిరక్షణ మన బాధ్యత. చెట్లు లేనిదే జీవరాశి ఉండదు. చెట్ల వల్లనే మనకు శుద్ధమైన ఆక్సిజన్ లభిస్తుంది. అందుకే ప్రతి ఒక్కరూ ఒక మొక్క నాటి దాన్ని కాపాడాలి అని అన్నారు.తెలంగాణ రాష్ట్రంలో తొలిసారిగా సంగంబండ లో ప్రారంభించిన మంత్రి తన కన్నతల్లి పేరు మీద మొక్కలు నాటే కార్యక్రమంను రాష్ట్రవ్యాప్తంగా విస్తరింపజేసేందుకు కృషి చేస్తానని మంత్రి తెలిపారు.ఈరోజు నేను కూడా మా తల్లి రాములమ్మ పేరుతో మొక్కను నాటుతున్నాను. మీరు కూడా మీ తల్లుల పేరుతో మొక్కలు నాటి వాటిని రక్షించాలి అని విద్యార్థులకు సూచించారు. అలాగే, సంగంబండ రెసిడెన్షియల్ పాఠశాల రాబోయే రోజుల్లో రాష్ట్రానికి ఒక రోల్ మోడల్‌గా నిలవాలని ఆకాంక్షించారు. పర్యావరణ పరిరక్షణపై విద్యార్థుల్లో చైతన్యం పెంపొందించేందుకు ఈవిధమైన కార్యక్రమాలు ఎంతో దోహదపడతాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ), డీఆర్‌డీవో, ఎంపీడీవో, ఏపీఓ, ఈసీలు, తహసీల్దార్లు, పంచాయితీ కార్యదర్శులు, అటవీ శాఖ అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు, గ్రామస్తులు , విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. మొక్కలు నాటి పచ్చదనాన్ని పెంపొందించాలన్నారు.

